
సాక్షి ఒడిశా

సోమవారం । 28 । జూలై । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం ఆదివారం లెక్కించారు. ఇందులో నగదు రూ.7,04,731లు, బంగారం 520 మిల్లీగ్రాములు, వెండి 57గ్రాముల 300 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.

దసపల్లాలో దుర్ఘటన



భువనేశ్వర్: నయాగడ్ జిల్లా దసపల్లా టకరా ప్రాంతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు దుర్మరణం పాలయ్యారు. 57వ నంబరు ఖుర్దా–బొలంగీరు జాతీయ రహదారిపై ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. ఈ మార్గంలో దూసుకు పోతున్న బైక్‌ని ప్రమాదం నుంచి రక్షించే ప్రయత్నంలో 2 ట్రక్కులు ఢీకొన్నట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఈ ప్రమాదంలో 2 ట్రక్కులు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఘటనా స్థలంలో ముగ్గురు మృతి చెందారు. మరో నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. పరిస్థితి విషమంగా ఉన్న వారిని దసపల్లా వైద్య బోధన ఆస్పత్రిలో చేర్పించారు.

న్యూస్‌రీల్

భర్తృహరి మహతాబ్‌కు సంసద్ రత్న పురస్కారం



భర్తృహరి మహతాబ్

భువనేశ్వర్: కటక్ లోక్ సభ నియోజక వర్గం సభ్యుడు డాక్టరు భర్తహరి మహతాబ్‌కు సంసద్ రత్న పురస్కారం లభించింది. ఈ ఏడాది పార్లమెంటులో సంసద్ రత్న పురస్కారానికి అర్హత పొందిన 17 మంది సభ్యుల్లో ఆయన ఒకరు కావడం విశేషం. సభలో జరిగిన చర్చలు, లేవనెత్తిన ప్రశ్నలు, ప్రవేశ పెట్టిన బిల్లుల ఆధారంగా ఈ పురస్కారానికి ఎంపిక చేస్తారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



నిత్యావసరాలను అందజేస్తున్న కన్వీనర్ ప్రసాద్

రాయగడ: సదరు సమితి పరిధిలోని మల్లిగా, కొత్తపేట పంచాయితీల్లో సుమారు వంద మంది నిరుపేద వృద్ధు మహిళలకు సత్యసాయి బాబా సేవా సమితి సభ్యులు రూ. 1500 విలువ చేసే బియ్యం, పప్పు, నూనె, బంగాళ దుంపలు వంటి నిత్యావసరాల వస్తువులను ఆదివారం పంపిణీ చేశారు. సత్యసాయిబాబా 100 జయంతిని పురస్కరించుకుని అమృత కలషం పేరుతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు సమితి కన్వీనర్ ప్రసాద్ పట్నాయక్ తెలిపారు. పేదల కోసం ప్రత్యేకంగా ఏర్పాటైన ఈ అమృత కలషం వారి ఆకలిని తీర్చేందుకు ఎంతగానో దోహద పడుతుందన్నారు. కార్యక్రమం అనంతరం సాయి భజన కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్న సమారాధన జరిపించారు. కార్యక్రమంలో అధికసంఖ్యలో సాయి, సేవాదళ సభ్యులు పాల్గొన్నారు.

కళింగ ఆటో గ్యారేజ్‌లో అగ్ని ప్రమాదం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

రాయగడ: చందిలి పోలీస్ స్టేషన్ పరిధిలోని జేకే రోడ్డులో ఉన్న కళింగ ఆటో సిండికేట్ గ్యారేజీలో శనివారం అర్ధరాత్రి భారీ అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో మూడు వాహనాలు పూర్తిగా దగ్ధం కాగా మరో రెండు వాహనాలు పాక్షికంగా దెబ్బ తిన్నాయి. దాదాపు రూ.20 లక్షల మేర ఆస్తి నష్టం సంభవించినట్లు బాధితులు తెలిపారు. ప్రమాదం సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని సుమారు రెండు గంటల సమయం వరకు మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. అగ్ని ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

మహిళా మావోయిస్టు లొంగుబాటు



పారొ (ఫైల్)

మావో యూనిఫారంలో పారొ

రాయగడ: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఒక మహిళా మావోయిస్టు లొంగిపోయారు. లొంగిపోయిన ఆమె శాంతి సికక వురఫ్ పారొ అని సమాచారం. రాయగడ జిల్లాలోని నియమగిరి పర్వతప్రాంతానికి చెందిన డొంగిరియా తెగకు చెందిన ఆమె 2015లో నాగావళి, వంశధార, ఘుంసూర మావోయిస్టుల దళంలో చేరింది. వివిధ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొంటున్న ఆమెను పట్టుకున్న వారికి ఒడిశా రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షల రివార్డును కూడా ప్రకటించింది. రెండు రోజుల కిందటే ఆమె భర్త మాలూన్ పోలీసులకు లొంగిపోయారు. ముప్పై ఏళ్ల వయసులో ఆయన మావోలతో కలిసి పనిచేశారు. అక్కడ పరిచయం కావడంతో వీరిద్దరూ పెళ్లి చేసుకున్నారు. అనంతరం ఇద్దరూ కార్యకలాపాల రీత్యా వేరు వేరు ప్రాంతాల్లో ఉండి విధులు నిర్వహిస్తుండేవారు. జన జీవన స్రవంతిలో కలిసిపోవాలని నిర్ణయించుకుని ఇలా లొంగిపోయారు.

ప్రాంతీయ సాహిత్యం వృద్ధి చెందాలి

- రాష్ట్ర గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటి
- బిశ్వభూషణ్ హరిచందన్‌కు ఉత్కళరత్న పురస్కారం



ఉత్కళ సాహిత్య సమాజ్ వార్షికోత్సవంలో గవర్నర్ ప్రసంగం



బిశ్వభూషణ్ హరిచందన్‌కు ఉత్కళ రత్న పురస్కారం ప్రదానం చేసిన రాష్ట్ర గవర్నర్

భువనేశ్వర్: సాహితీ విలువల పరిరక్షణ కోసం వర్ధమాన తరాల్లో ప్రాంతీయ భాషలు, సాహిత్యం పట్ల మక్కువ పెంచే రీతిలో శ్రద్ధ వహించాల్సి ఉందని, ఈ బృహత్కార్యానికి సమిష్టి కృషి చేయాలని రాష్ట్ర గవర్నర్ డాక్టర్ హరి బాబు కంభంపాటి పిలుపునిచ్చారు. కటక్‌లో జరిగిన ఉత్కళ సాహిత్య సమాజ్ 123వ వార్షికోత్సవంలో ఆయన ప్రసంగిస్తూ మన సాహిత్యం స్మృతులు, జ్ఞాపకాలకు పరిమితం కాకూడదని అన్నారు. కాలమాన పరిస్థితులకు అనుగుణంగా స్ఫూర్తినిచ్చే సజీవ, పరిణామ శక్తిగా వెలుగొందాలని అన్నారు. ఈ నేపథ్యంలో ఉత్కళ సాహిత్య సమాజ్ ఒడిశా సాహిత్య పునరుజ్జీవనానికి ఒక వెలుగు రేఖ అని, ఒడియా భాష, సాహిత్యానికి దృఢమైన సంరక్షకునిగా సుదీర్ఘ కృషి ప్రశంసనీయమని గవర్నర్ కొనియాడారు. జాతీయ విద్యా విధానం 2020 మాతృభాష అభ్యాసంపై దృష్టి సారించాలని ప్రోత్సహించారు. ఉత్కళ సాహిత్య సమాజ్ వంటి సంస్థలు సాహిత్య పరిశోధనను బలోపేతం చేసి అనువాద ప్రయత్నాలను ప్రోత్సహించాలని సూచించారు. ఆయా రంగాల్లో డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా యువతను నిమగ్నం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల మాజీ గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ జీవన సాఫల్య ప్రజాసేవ, ఒడియా సాహిత్యానికి చేసిన నిరంతర కృషికి గుర్తింపుగా ఉత్కళ సాహిత్య సమాజ్ అత్యున్నత ప్రతిష్టాత్మక ఉత్కళ రత్న పురస్కారం గవర్నర్ ప్రదానం చేశారు. రాజనీతిజ్ఞుడిగా, సాహితీవేత్తగా బిశ్వ భూషణ్ హరిచందన్ నిరవధిక కృషిని గవర్నర్ ప్రశంసించారు. ప్రతిష్టాత్మక పురస్కార గ్రహీత బిశ్వ భూషణ్ హరిచందన్ మాట్లాడుతూ సాహిత్యం అత్యంత శక్తివంతమైనదని అన్నారు. కుప్పకూలి పోతున్న విపత్కర పరిస్థితుల్లో సమాజం పునర్నిర్మాణానికి ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. రచయితలు, కవులు తమ కలాలను ఝుళిపించి సాహిత్యపరమైన చైతన్యంతో సమాజానికి మేలుకొలుపుతారని అన్నారు. కలం కత్తి కంటే శక్తివంతమైనదని తెలిపారు. ఈ సందర్భంగా ప్రసంగించిన వారిలో ఉత్కళ సాహిత్య సమాజ్ అధ్యక్షుడు డాక్టర్ గోవింద చంద్ర చాంద్, ఉపాధ్యక్షులు జీవనానంద అధికారి, ప్రధాన కార్యదర్శి ఆదిత్య ప్రతాప్ ధొలొ మరియు సలహాదారు బిజయానంద సింగ్ ఉన్నారు.

బిందెలో ఇరుక్కుపోయిన బాలుడి తల



బిందెను కట్ చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది



బిందెలో ఇరుక్కుపోయిన బాలుడి తల

మల్కన్‌గిరి : మల్కన్‌గిరి జిల్లా కోరుకొండ సమితి కేంద్రంలో శనివారం ఓ బాలుడి తల బిందెలో ఇరుక్కుపోయింది. నాలుగేళ్ల తన్మయి బిశ్వాస్ ఆడుకుంటూ బిందెలో తల పెట్టేశాడు. కానీ తల వెనక్కి రాక పోవడంతో ఏడుపు మొదలుపెట్టాడు. దీంతో తల్లి దండ్రులు అగ్ని మాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి ప్రత్యేక కత్తెరతో బిందెను కట్ చేసి బాలుడిని రక్షించారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి



భారతి (వృత్తంలో) (ఫైల్)



సంఘటన స్థలం వద్ద భారతి మృతదేహం

రాయగడ: విద్యుదాఘాతంతో మహిళ మృతి చెందిన ఘటన స్థానిక గాంధీనగర్ రెండో వీధిలో ఆదివారం చోటు చేసుకుంది. మృతురాలు కె.భారతి (62)గా గుర్తించారు. ఉదయం ఆరు గంటల సమయంలో తడి బట్టలను మేడపై ఉన్న ఇనుప తీగాపై ఆరవేస్తున్న సమయంలో విద్యుత్‌షాక్ తగిగి ఆమె కింద పడిపోయారు. బట్టలు ఆరవేసేందుకు వెళ్లిన ఆమె కిందకి దిగిరాకపోవడంతో మేడ మీదకు వెళ్లి చూసిన కుటుంబీకులకు భారతి అపస్మారక స్థితిలో పడి ఉండటం గమనించారు. అయితే అప్పటికే ఆమె మృతి చెందినట్లు గుర్తించిన కుటుంబీకులు ఆమెపై ఇనుప తీగ పడి ఉండడంతో విద్యుత్‌షాక్‌కు గురైనట్లు గుర్తించారు. సమీపంలో గల విద్యుత్ తీగను ఎలుక కొరికేయడంతో అది సరాసరి బట్టలు ఆరబెట్టేందుకు ఉన్న ఇనుప తీగాపై పడిందని అనుమానిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న సదరు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమెదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు చెప్పారు.

68 యూనిట్ల రక్తం సేకరణ



రక్తదానం చేస్తున్న దాత



రక్తదాన శిబిరం నిర్వాహకులతో సహకరించిన వారు



రక్త దాతలకు ప్రశంసా పత్రాలు అందజేస్తూ..

జయపురం: జయపురం రోటరీ క్లబ్ ఆఫ్ ఫ్రెడ్ ఆధ్వర్యంలో స్థానిక ఎన్‌కేటీ రోడ్డు వాసవీ భవనంలో ఆదివారం స్వచ్ఛంద శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 68 యూనిట్ల రక్తం సేకరించినట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఉదయం తొమ్మిది గంటలకు రోటరీ క్లబ్ అధ్యక్షులు సురేష్ పాణిగ్రహి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రక్తదానం చేయండి ఇతరుల ప్రాణాలను కాపాడండి అనే నినాదంతో శిబిరాలను తరచూ నిర్వహిస్తామని ప్రకటించారు. రక్తదానం చేసేవారికి గుండె జబ్బుల ప్రమాదం తగ్గుతుందని, రక్త ప్రసరాన్ని పెంచుతుందని, కొత్త బ్లడ్ సెల్స్ పెరుగుతాయని, క్యాన్సర్ వచ్చే ప్రమాదాన్ని తగ్గిస్తుందని వివరించారు. ప్రతిఒక్కరూ రక్తదానం చేసి ఆపదలో ఉన్న వారి ప్రాణాలు కాపాడాలని పిలుపు నిచ్చారు. శిబిరంలో రోటరీ క్లబ్ కార్యదర్శి రబినారాయణ నంద, జయపురం సబ్‌డివిజన్ రక్త దాతల మోటివేటెడ్ అసోసియేషన్ కార్యదర్శి ప్రమోద్ కుమార్ రౌళో, రోటరీ సభ్యులు పాల్గొన్నారు.

నిలిచిపోయిన విద్యుత్ సరఫరా

రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన కొంత సమయానికి విద్యుత్ సరఫరా నిలిచి పోయింది. సుమారు ఒక గంటపాటు రక్త దాతలకు ఇబ్బంది కలిగింది. మధ్యాహ్నం రెండు గంటల వరకు సాగిన శిబిరంలో అనేక మంది స్వచ్ఛందంగా వచ్చి రక్తదానం చేశారు. జయపురం జిల్లా కేంద్ర ఆస్పత్రి బ్లడ్‌బ్యాంకు అధికారి డాక్టర్ ఎస్.ఎస్.మిశ్ర నేతృత్వంలో టెక్నీషియన్‌లు అమలాన్ జ్యోతి, ప్రమోద్ ఖిలోలు దాతల నుంచి రక్తం సేకరించారు. విక్రమదేవ్ విశ్వ విద్యాలయ విద్యార్థులు, ఎన్‌సీసీ కేడెట్లు సహకరించారు. రక్త దాతలకు నిర్వాహకులు ప్రశంసా పత్రాలు అందజేశారు.

• చేప చిక్కెను



వరద పొంగుతో నదీ గర్భం నుంచి తేలిన అతి బరువైన చేప జాలరి వలకు చిక్కింది. దీని బరువు 170 కిలోలు ఉండడం విశేషం. అంగుల్ జిల్లా బ్రాహ్మణి నది దిగువ సమల్ బ్యారేజ్ ప్రాంతంలో నదిలోకి వరద నీరు ప్రవేశించినప్పుడు చేప దొరికినట్టు మత్స్యకారులు తెలిపారు.

– భువనేశ్వర్

నిండుకుండలా జలాశయాలు



జలకళను సంతరించుకున్న అప్పర కొలాబ్ ప్రాజెక్టు జలాశయం

జయపురం: కొరాపుట్ జిల్లాలో 15 రోజులుగా ఎడతెరపిలేని వర్షాలు పడుతున్నాయి. దీంతో అప్పర్ కొలాబ్ జల విద్యుత్ ప్రాజెక్టు, తెలింగిరి సాగునీటి ప్రాజెక్టులు జలకళను సంతరించుకున్నాయి. శనివారం అప్పర్ కొలాబ్ ప్రాజెక్టు డ్యామ్ ప్రాంతంలో 36 మిల్లీ మీటర్ల వర్షం పడింది. విరామం లేకుండా పడుతున్న వర్షాల కారణంగా ప్రాజెక్టు జలాశయంలో నీటి మట్టం పెరుగుతోంది. శనివారం నాటికి జలాశయంలో నీరు 851.74 మీటర్లకు చేరింది. గత ఏడాది ఈ సమయానికి 851.75 మీటర్లు ఉండేదని అధికార వర్గాల ద్వారా తెలిసింది. అధిక వర్షాల కారణంగా ప్రతి నిమిషానికి 168.275 క్యూసెక్కులు నీరు జలాశయంలోనికి చేరుతుండగా.. జలాశయం నుంచి బయటకు 52.4 క్యూసెక్కులను విడిచిపెడుతున్నారు. ఇదిలా ఉండగా..జయపురం సబ్‌డివిజన్ బొయిపరిగుడ సమితిలోని తెలింగిరి సాగునీటి ప్రాజెక్టు డ్యామ్ మరమ్మతులు పూర్తయిన తరువాత ఆ జలాశయంలోనికి నీరు చేరటం ప్రారంభమైంది. ఆదివారం జలాశయంలో నీటి 628.2 మీటర్ల నీటిమట్టం ఉంది. జలాశయం డ్యామ్ సగటు నీటి మట్టం 633 మీటర్లు కాగా గత ఏడాది ఇదే సమయానికి 625.1 మీటర్లు ఉండేది. కాగా ఖరీఫ్ పంటలకు రెండు ప్రాజెక్టుల నుంచి కెనాల్ ద్వారా సాగు నీరు విడిచి పడుతున్నారు.

భట్టారిక మాత ఆలయ ఆవరణలోకి వరద నీరు



భట్టారిక మాత ఆలయ ఆవరణ



జల దిగ్బంధంలో భట్టారిక మాత ఆలయ ప్రాంగణం

భువనేశ్వర్: కటక్ జిల్లా అఠాగాడా బొడొంబా గ్రామం ఆరాధ్య దేవత భట్టారికా మాత. ఈ ఆలయ ప్రాంగణంలోకి ఆదివారం మహానది వరద నీరు చేరింది. ఇటీవల కాలంలో అమ్మవారి ఆలయం లోనికి వరద నీరు చొరబడడం వరుసగా ఇది రెండోసారి. హిరాకుద్ జలాశయం 20 గేట్లు తెరవడంతో తరలి వచ్చిన వరద నీరు ఆలయంలోనికి ప్రవేశించింది. ఆలయ ఆవరణలో నీటి మట్టం మరో 2 అడుగులు మించితే ఆలయం లోపలకి వరద నీరు ప్రవేశిస్తుందని భయాందోళనలు వ్యక్తం అవుతున్నాయి. ఆ పరిస్థితుల్లో సురక్షిత ప్రాంతానికి అమ్మవారిని తరలిస్తారు.

గజపతి జిల్లా కలెక్టర్ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరించిన మధుమిత



కలెక్టర్ మధుమితకు స్వాగతం పలుకుతున్న ఆర్‌అండ్‌బీ ఎస్ఈ అభిషేక్ శెఠి

పర్లాకిమిడి: గజపతి జిల్లా కలెక్టర్‌గా మధుమిత పర్లాకిమిడి కలెక్టరేట్‌లో ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ ఇక్కడ పని చేసిన బిజయకుమార్ దాస రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ అదనపు శాసన కార్యదర్శిగా భుభనేశ్వర్‌కు బదిలీ అయ్యారు. బాధ్యతలు చేపట్టిన కలెక్టర్ మధుమితకు పలువురు ప్రభుత్వ అధికారులు పుష్పగుచ్ఛాలతో స్వాగతించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పథకాలను లబ్ధిదారులకు చేరువయ్యేలా కృషిచేస్తానని చెప్పారు. అలాగే సాధారణ ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందించటంలో కూడా ముందుంటానని అన్నారు. కలెక్టర్ మధుమితను కలిసిన వారిలో జిల్లా ఎస్పీ జ్యోతింద్ర పండా, సీడీఎంవో డాక్టర్ ఎం.ఎం. ఆలీ, ఏడీఎం. ఫాల్గునీ మఝి, జిల్లా పరిషత్తు సీడీవో శంకర కెరకెటా, రోడ్లుభవనాల శాఖ ఎస్ఈ అభిషేక్ శెట్టి, వాటర్ షెడ్ డిపార్టుమెంటు పీడీ సురేష్ పట్నాయక్ ఉన్నారు.

అమ్మో ఇన్ని ఆస్తులా..?



పట్టుబడిన వెండి సామాన్లు



అటవీ డిప్యూటీ రేంజర్ నేపక్



పత్రికల వారికి వివరిస్తున్న విజిలెన్స్ ఎస్పీ



పట్టుబడిన బంగారు బిస్కట్లు, నగలు



పట్టుబడిన నోట్ల కట్టలు

జయపురం: జయపురం ఫారెస్టు డివిజన్‌లో డిప్యూటీ రేంజర్ రామచంద్ర నేపక్ తన ఆదాయానికి మించి 501 శాతం ఎక్కువ ఆస్తులు కలిగి ఉన్నట్లు కొరాపుట్ విజిలెన్స్ డివిజన్, జయపురం ఎస్పీ నరేంద్ర కుమార్ శనివారం సాయంత్రం జయపురం కార్యాలయంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో వెల్లడించారు. అతడి ఇంటిలో రూ.1 కోటి 43 లక్షల 34 వేలతో పాటు బ్యాంకులలో బీమాలో డిపాజిట్‌లు రూ.1 కోటి 32 లక్షల 85 వేల 754 ఉన్నాయని తెలిపారు. జయపురం ఎస్‌కేటీ రోడ్డులో 4000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఒక మల్టీ స్టోర్డ్ బిల్డింగ్, 3 ప్లాట్‌లు, 2 హై వాల్యూ ప్లాట్‌లు, భువనేశ్వర్ యుఎమ్ఎస్ భాగభటి మాన్సన్ రఘునాథ్‌పూర్ జాలిలో 1800 చదరపు అడుగుల విస్తీర్ణంలో 3-బీకెహెచ్ ప్లాట్, జయపురం ప్రసాదరావు పేట గోల్డెన్ హైట్ రెసిడెన్సియల్ అపార్ట్ మెంట్‌లో 1500 చదరపు అడుగుల విస్తీర్ణంలో 2 బీకెహెచ్‌కే ప్లాట్‌లు, 1.504 కేజీల బంగారం, 4.6 కేజీల వెండి, 2 నాలుగు చక్రాల కార్లు, 3 ద్విచక్ర వాహనాలు, రూ.15.50 లక్షల విలువైన గృహ పరికరాలు కనుగొనటం జరిగిందని వెల్లడించారు. ఇంకా దర్యాప్తు జరుపుతున్నామని తెలిపారు.

క్లుప్తంగా

షిర్డీసాయి ఆలయంలో చోరీ



ఆలయంలో చోరీ జరిగిన దృశ్యాలు

శ్రీకాకుళం రూరల్: పెదగనగళ్లవానిపేట పంచాయతీ గాంధీనగర్ కాలనీలో షిర్డీసాయిబాబా ఆలయంలో రెండు రోజులు కిందట చోరీ జరగగా ఆదివారం వెలుగులోకి వచ్చింది. గుర్తు తెలియని దుండగులు ఆలయంలోకి ప్రవేశించి రెండు జతల వెండి కిరీటాలు, వెండి పాదాలు, దీపం కుందెలు పట్టుకుపోయారని గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వీటి విలువ రూ.43,500 ఉంటుందని ప్రాథమిక అంచనా వేసారు. రూరల్ ఎస్ఐ రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డిపార్ట్‌మెంటల్ పరీక్షల పరిశీలన



పరీక్షలను పర్యవేక్షిస్తున్న డీఆర్‌ఓ

ఎచ్చెర్ల : చిలకపాలెంలోని శ్రీశివానీ ఇంజినీరింగ్ కళాశాలలో ఏపీపీఎస్సీ నిర్వహిస్తున్న డిపార్ట్‌మెంటల్ పరీక్షల నిర్వహణను జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు ఆదివారం పర్యవేక్షించారు. జూలై 27 నుంచి ఆగస్టు 1 వరకూ రెండు విడతలుగా ఈ పరీక్షలు జరుగుతున్నాయి. శ్రీశివానీ కాలేజీలో మొదటి రోజు జరిగిన పరీక్షకు 190 మంది అభ్యర్థులకు గాను 163 మంది హాజరయ్యారు. డీఆర్‌వోతోపాటు ఏపీపీఎస్సీ సెక్షన్ అధికారి భోగేశ్వరి, పద్మప్రియ, హెచ్–సెక్షన్ సూపరింటెండెంట్ జోగారావు పర్యవేక్షించారు.

తీరానికి కొట్టుకొచ్చిన మృతదేహం



ధనరాజు మృతదేహం

వజ్రపుకొత్తూరు రూరల్: నువ్వలరేవు సముద్రతీరానికి ఆదివారం ఓ వ్యక్తి మృతదేహం చేరింది. అక్కుపల్లి గ్రామానికి చెందిన మద్దు ధనరాజు కొంత కాలంగా మానసిక సమస్యలు, ఫిట్స్‌తో బాధపడుతున్నారు. ఈ నెల 20న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి చేరుకోలేదు. ఈ క్రమంలో సముద్రంలో కొట్టుకుపోయి మృతిచెందాడు. ఆదివారం నువ్వలరేవు తీరానికి మృతదేహం చేరడంతో సోదరుడు వాసు పోలీసులకు సమాచారం అందించారు. అనంతరం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహన్ని పలాస ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, ధనరాజు తల్లిదండ్రులు 18 ఏళ్ల క్రితం మృతి చెందడంతో సోదరి హైమా వద్ద ఉంటున్నాడు.

అంబులెన్సుకు ప్రమాదం



ఘటనా స్థలంలో అంబులెన్స్

టెక్కలి రూరల్: మండలంలోని చాకిపల్లి గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం వేకువజామున ఓ అంబులెన్స్ రోడ్డు ప్రమాదానికి గురైంది. హైదరాబాద్‌కు చెందిన అంబులెన్స్ పలాస వచ్చి తిరిగి వెళ్తుండగా చాకిపల్లి కొత్తూరు సమీప జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న లారీ ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో వెనుకనే వస్తున్న అంబులెన్స్ ఢీకొట్టింది. ఈ ఘటనలో ఎవరికీ ప్రమాదం జరగకపోవడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. విషయం తెలుసుకున్న హైవే సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్ అంతరాయం కలగకుండా చర్యలు తీసుకున్నారు.

అంబరాన్నంటిన సంబరం



ఉత్కళాంధ్రుల ఆరాధ్య దైవం లొద్దపుట్టిలో పూజలందుకుంటున్న ధనరాజుల తులసమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఆంధ్రా, ఒడిశా గ్రామాలకు చెందిన భక్తులు సంబరాలు పేరిట మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా కాళీమాత వేషధారణలు, కోయ నృత్యాలతో ఊరేగింపు నిర్వహించారు. – ఇచ్ఛాపురం రూరల్

ఆశ్రమ పాఠశాల విద్యార్థిని మృతి

- పాఠశాల నిర్వాహకుల నిర్లక్ష్యమే కారణమని తల్లిదండ్రులు, బంధువుల ఆరోపణ
- మృతదేహాన్ని ఆశ్రమ పాఠశాల ఎదుట ఉంచి ఆందోళన



ఆశ్రమ పాఠశాల



విద్యార్థిని మృతదేహం



ఆశ్రమ పాఠశాల వద్ద బాధితుల ఆందోళన

రాయగడ: సదరు సమితి కూలిలో గల ఆదివాసీ, హరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆశ్రమ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్న దివ్యా మండగి అనే విద్యార్థిని మృతి చెందింది. ఆశ్రమ పాఠశాల నిర్వాహకుల నిర్లక్ష్యం కారణంగానే విద్యార్థిని మృతి చెందిందని బాధిత కుటుంబీకులు ఆరోపించారు. ఆదివారం రాత్రి మృతదేహన్ని ఆశ్రమ పాఠశాల వద్ద ఉంచి ఆందోళన చేపట్టారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో చందిలి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చే ప్రయత్నం చేశారు. కూలి ఆశ్రమ పాఠశాలలో దివ్యా మండంగికి ఈ నెల 19వ తేదీన తీవ్రమైన జ్వరం వచ్చింది. ఈ విషయాన్ని తల్లిదండ్రులకు ఆశ్రమ పాఠశాల నిర్వాహకులు తెలియజేయలేదు. కుమార్తె ఆరోగ్యం బాగులేదని తెలుసుకున్న విద్యార్థిని తండ్రి ఆశ్రమ పాఠశాలకు వెళ్లారు. చికిత్స కోసం తీసుకువెళ్తానని, తనతో పంపించాలని అడిగినా అటువంటిదేమీ లేదని, ప్రస్తుతం ఆరోగ్య పరిస్థితి బాగుందని చెప్పి పంపించేశారు. విద్యార్థిని ఆరోగ్య పరిస్థితి క్షీణించడంతో జిల్లా కేంద్రా ఆస్పత్రికి శుక్రవారం పాఠశాల నిర్వాహకులు చికిత్స కోసం తీసుకువెళ్లారు. వైద్య పరీక్షలు నిర్వహించారు. పరిస్థితి ఆందోనకరంగా ఉందని, వెంటనే బరంపురం తరలించాలని సూచించారు. ఈ విషయాన్ని విద్యార్థిని తల్లిదండ్రులకు చెప్పడంతో జిల్లా కేంద్ర ఆస్పత్రికి వచ్చి.. వెంటనే బరంపురం హస్పిటల్‌కు మెరుగైన చికిత్స కోసం ఆదివారం ఉదయం తరలించారు. బరంపురంలో చికిత్స పొందుతూ విద్యార్థిని మృతి చెందింది. వెంటనే మృతదేహన్ని తీసుకువచ్చిన కుటుంబీకులు ఆశ్రమ పాఠశాల నిర్వాహకుల నిర్లక్ష్యం కారణంగానే మృతి చెందిందని ఆరోపిస్తూ ఆందోళన చేపట్టారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు.

జగన్నాథుని దర్శించుకున్న ఓఏఎస్ శిక్షణార్థులు



పూరీలోని శ్రీ మందిరాన్ని (జగన్నాథ) గోపబంధు అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్స్ సంస్థలో శిక్షణ పొందుతున్న సివిల్స్ ఉత్తీర్ణులు, భావి అధికారుల బృందం సభ్యులు ఆదివారం దర్శించుకున్నారు. స్వామి ఆశీస్సులతో వీరంతా అంకిత భావంతో సమాజానికి సేవ చేయగలుగుతారని శ్రీ మందిరం ప్రధాన పాలన అధికారి సీఏఓ డాక్టర్ అరవింద కుమార్ పాడీ అభినందించారు. – భువనేశ్వర్

సహాయ ప్రొఫెసర్ భార్యపై అత్యాచార యత్నం



ఫకీర్ మోహన్ విశ్వ విద్యాలయం

భువనేశ్వర్: బాలాసోర్ ఫకీర్ మోహన్ విశ్వ విద్యాలయం క్యాంపస్‌లో సహాయ ప్రొఫెసర్ భార్యపై అత్యాచార యత్నం జరిగింది. అధ్యాపకుల క్వార్టర్స్‌లోకి చొరబడి ఈ చర్యకు పాల్పడినట్లు ఆరోపణ. ఈ మేరకు బాధితురాలు రెముణా పోలీస్ ఠాణాలో ఈ ఫిర్యాదు చేసింది. నిందిత యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు.

క్యాంపస్ భద్రత పెంపు

సహాయ ప్రొఫెసర్ భార్యపై అత్యాచార యత్నం తర్వాత బాలాసోర్‌లోని ఫకీర్ మోహన్ యూనివర్సిటీలో భద్రతను పెంచారు. సంఘటన జరిగిన సమయంలో పనిచేస్తున్న ఒక సెక్యూరిటీ గార్డును తొలగించారు. ప్రతి గేటు వద్ద 2 మంది చొప్పున సెక్యూరిటీ గార్డులను నియమించారు. క్యాంపస్‌లో పనిచేసే కార్మికులు తమ ఆధార్ కార్డులను చూపించి లోనికి ప్రవేశించాల్సి ఉంటుంది. క్యాంపస్ భద్రత పటిష్టత కోసం ఏర్పాట్లు చేయాలని డీజీపీకి లేఖ రాస్తామని వైస్ చాన్సలర్ తెలిపారు.

పోలీసులకు చిక్కిన రీల్స్ సోగ్గాడు!



నడి రోడ్డు మీద తుపాకీతో రీల్స్ షూటింగు



పోలీసుల అదుపులో రీల్స్ సోగ్గాడు

భువనేశ్వర్: నడి రోడ్డు మీద విలాసవంతమైన మోటారు సైకిల్‌పై తుపాకీ పట్టుకుని రీల్స్ చిత్రీకరిస్తున్న సోగ్గాడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. యువకుడి విన్యాసాలు పరిసరాల్లో తిరుగాడుతున్న ప్రజలను భయాందోళకు గురి చేస్తున్నాయని సోషల్ మీడియాలో దుమారం రేగింది. ఉత్సాహవంతమైన రీల్స్ చిత్రీకరణ ముగియక ముందే పోలీసులకు చిక్కాడు. అంగుల్ ప్రాంతం ప్రధాన రహదారిపై హెల్మెట్ లేకుండా రోడ్డు భద్రతా నియమాలను ఉల్లంఘిస్తు చేతిలో తుపాకీ పట్టుకుని వీరత్వం ప్రదర్శించి ఒంటి చేతితో రాయల్ ఎన్‌ఫీల్డు గాలి వేగంతో నడుపుతూ వీడియో చిత్రీకరించాడు. ఈ దృశ్యాన్ని సాంఘిక మాధ్యమంలో ప్రసారం చేయడంతో పోలీసులు రంగంలోకి దిగి రీల్స్ హీరోని అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. యువకుడు వినియోగించిన రాయల్ ఎన్‌ఫీల్డు వాహనం, వీరత్వ ప్రదర్శనకు వినియోగించిన బొమ్మ తుపాకీ స్వాధీనం చేసుకుని అతనిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు ఖండపడా ఠాణా పోలీసులు తెలిపారు.

లిఫ్ట్ ఇస్తానని చెప్పి.. బాలికపై లైంగిక దాడి

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా బలిమెల పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం బాలికపై లైంగిక దాడి జరిగింది. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. బాలిక ఒంటరిగా వస్తున్న సమయంలో ఓ యువకుడు బైక్‌పై లిఫ్ట్ ఇస్తానని నమ్మించి కొంతదూరం తీసుకెళ్లి నిర్మానుష్యమైన ప్రాంతంలో లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక ఎంతకీ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతికారు. ఆ సమయంలో రహదారి పక్కన ఓ చోట బాలిక ఏడుస్తూ కూర్చుంది. బాలిక మేనమామ బలిమెల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఐఐసీ ధీరజ్ పట్నాయక్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

కాటేసిన నాగుపాముతో ఆస్పత్రికి..



పాముతో యువకుడు

భువనేశ్వర్: విష సర్పం కాటుతో గాయపడిన చేతికి గుడ్డ, మరో చేతిలో కాటేసిన 4 అడుగుల పొడవైన పాముతో ఓ యువకుడు ఆస్పత్రిలో ప్రత్యక్షం అయ్యాడు. యువకుని అవతారం చూసి అక్కడి వైద్యులు, సిబ్బంది అవాక్కయ్యారు. ఈ విచిత్ర సంఘటన అంగుల్ జిల్లాలో చోటుచేసుకుంది. నిషా పోలీస్ ఠాణా పరిధిలోని కలియాకొట గ్రామస్తుడు బుబుల్ భోయ్ (25) పాము కాటుకు గురయ్యాడు. బంధువులలో ఒకరి ఇంట్లో చొరబడిన పామును పట్టుకునే ప్రయత్నంలో అతడి కుడి చేతికి గాయమైంది. విషపూరిత పాము కాటుకు గురైన తర్వాత ఆ పామును పట్టుకున్న వీడియోను రికార్డ్ చేసి స్వయంగా స్థానిక ఆస్పత్రికి చేరాడు. అతని ప్రాణాలకు ప్రమాదం ఉన్నందున ప్రథమ చికిత్స చేసి జిల్లా ప్రధాన కార్యాలయ ఆస్పత్రికి తరలించారు.

బిడ్డకు జన్మనిచ్చిన మైనర్ బాలిక!

- నిందితుడు అరెస్టు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లాలో ఘోరం జరిగింది. ఖోయిర్‌పూట్ సమితి ముదిలిపోడ పోలీసుస్టేషన్ పరిధిలో మైనర్ బాలికపై లైంగిక దాడి జరిగిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాలిక గర్భం దాల్చినప్పటికీ కారణకులెవరో చెప్పకపోవడంతో మౌనంగా ఉండిపోయారు. అయితే నెలలు నిండకముందు శనివారం మగ బిడ్డకు జన్మనివ్వడంతోపాటు కారకుడెవరో చెప్పడంతో తల్లిదండ్రులు మేల్కొన్నారు. ఆదివారం ముదిలిపోఢ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగు చూసింది. అదే గ్రామానికి చెందిన యువకుడు బాలికపై లైంగికదాడికి పాల్పడినట్టు ఫిర్యాదులో పేర్కొవడంతో అతన్ని అరెస్టు చేశారు. సోమవారం కోర్టులో హాజరుపరుస్తామని పోలీసులు వెల్లడించారు.

యువకుని దారుణ హత్య

- పోలీసుల అదుపులో నిందితులు



కందపాణి మృతదేహం



కందపాణి (ఫైల్)

రాయగడ: జిల్లా పరిధిలోని కుంభికోట పోలీస్ స్టేషన్ పరిధిలో గల పాడామర్ గ్రామానికి చెందిన యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. ఆదివారం చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించి నలుగురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు తెలియజేసిన వివరాల ప్రకారం.. ఆదివారం మధ్యాహ్నం పాడామర్ గ్రామానికి చెందిన సంజయ్ కందపాణి (30) అనే యువకుడు ఏదో పనిపై కుంభికొట బస్టాండ్ వద్ద నిలబడ్డాడు. అదే సమయంలో నలుగురు వ్యక్తులు అతనిపై ఆకస్మాతుగా మరణాయుధాలతో దాడి చేశారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన కందపాణిని అక్కడి వారు కొందరు కుంభికొట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. మృతుని కుటుంబీకులు ఈ మేరకు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. నలుగురు యువకులను అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు. హత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

రాష్ట్రంలో సముద్ర రవాణా పెరుగుతోంది



పారాదీప్ ఓడ రేవు

- 80 మిలియన్ టన్నుల సరుకు రవాణా

భువనేశ్వర్: దేశంలోని ప్రధాన సముద్ర రవాణా కేంద్రంగా రాష్ట్రం ఆవిర్భవించనుంది. సముద్ర వాణిజ్యం, సరుకుల రవాణా గణనీయంగా పెరుగుతుండడం ఈ ఉత్సాహాన్ని రెట్టింపు చేస్తోంది. రాష్ట్రంలోని ప్రధానేతర ఓడ రేవుల సరుకు రవాణా సామర్థ్యం 2024–25 ఆర్థిక సంవత్సరంలో 80 మిలియన్ టన్నులకు చేరుకుంది. దీనిలో ధామ్రా ఓడ రేవు వాటా అత్యధికంగా 46.08 మిలియన్ టన్నులు కాగా.. గోపాల్‌పూర్ ఓడ రేవు సామర్థ్యం 6 మిలియన్ టన్నులకు చేరుకుంది. దీనివల్ల 2024–25 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రానికి రూ.306.15 కోట్ల ఆదాయం చేకూరింది. 2024–25లో 150.41 మిలియన్ టన్నుల సరుకును రవాణా చేయడం ద్వారా పారదీప్ ఓడ రేవు దేశంలోని ప్రధాన ఓడరేవులలో అత్యధిక మొత్తంలో సరుకును రవాణా చేసిన ఘనత సాధించింది. సాంకేతికత, లోతైన బెర్త్‌లు, ఇతర ఆధునిక సౌకర్యాల ఓడరేవుగా రాష్ట్రంలో సముద్ర మార్గ వాణిజ్యానికి కొత్త అవకాశాలు కల్పిస్తుంది. ధామ్రా, గోపాల్‌పూర్ ఓడ రేవులు అంతర్జాతీయ స్థాయిలో మెరుగైన అనుసంధానంతో పురోగతి సాధిస్తున్నాయి. రాష్ట్రంలో ప్రధాన, ప్రధానేతర ఓడ రేవుల సామర్థ్యం క్రమంగా పెరుగుతున్నందున ఒడిశా ప్రపంచ సముద్ర వాణిజ్యానికి ముఖ్యమైన కేంద్రంగా మారనుందని అనబంధ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి. తీరప్రాంత షిప్పింగ్ ద్వారా రాష్ట్రంలోని పారిశ్రామిక ప్రాంతాలు, వ్యవసాయ ఉత్పత్తి కేంద్రాలతో అనుసంధానం మెరుగుపడుతుంది.

మహానది కోల్‌ఫీల్డ్‌తో జిల్లా యంత్రాంగం ఒప్పందం



ఒప్పంద పత్రాలతో కోల్డ్‌ఫీల్డ్ కంపెనీ యజమాని సుబ్రజ్యోతి, సిబ్బందితో జిల్లా కలెక్టర్ పట్వారి

రాయగడ: మహానది కోల్‌ఫీల్డ్ కంపెనీతో జిల్లా యంత్రాంగం మూడు అవగాహన ఒప్పందాలను కుదుర్చుకుంది. అందుకు సంబంధించి కోల్‌ఫీల్డ్ కంపెనీ మేనేజరు సుబ్రజ్యోతి సాహుతో జిల్లా కలెక్టర్ ఫరూల్ పట్వారి శనివారం ఈ మేరకు ఒప్పంద పత్రాలపై సంతకాలు పెట్టారు. కంపెనీ సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా రాయగడ జిల్లాలోని గిరిజన పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మంచాలు, పరుపులు, ఇతరత్ర సౌకర్యాలు అందించడానికి సీఎస్ఆర్ నిధి కింద రూ. 4.5 కోట్లు ఖర్చు చేసేందుకు మహానది కోల్‌ఫీల్డ్ కంపెనీ ఒప్పందం చేసింది. ఈ మొత్తం వ్యయాన్ని జిల్లా యంత్రాంగం ద్వారా ఖర్చు చేసేందుకు అవగాహన కుదుర్చుకున్నారు. అదేవిధంగా జిల్లాలోని మునిగుడ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో సుమారు రూ. 58 లక్షలతో డయాల్సిస్ యూనిట్‌ను ఏర్పాటు చేసేందుకు కోల్‌ఫీల్డ్ కంపెనీ అంగీకరించింది. దీని ద్వారా మునిగుడ పరిసర ప్రాంతాలకు చెందిన ఎంతోమంది ప్రజలు మెరుగైన వైద్య సౌకర్యాలు పొందుతారు. జిల్లాలోని కాసీపూర్, పద్మపూర్ మునిగుడ సమితుల్లో గర్భిణుల ఆరోగ్య సంరక్షణతోపాటు వారికి సకాలంలో పౌష్టికాహారం అందించడం, అలాగే పిల్లలకు పౌష్టికాహారంతోపాటు వారి ఆరోగ్య భద్రతను మెరుగు పరిచేందుకు కంపెనీ తరపున సమారు 3 కోట్ల 96 లక్షల 21 వేల రూపాయలను ఖర్చు చేసేందుకు అంగీకరించారు.

ఆదిత్యా నమోస్తుతే!



ఆదిత్యుని దర్శనాలకు వెళ్తున్న భక్తులు

అరసవల్లి: ప్రత్యక్ష దైవం అరసవల్లి సూర్యనారాయణ స్వామిని ఆదివారం పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. శ్రావణ మాస మొదటి ఆదివారం కావడంతో ఇతర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి ఆదిత్యునికి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎక్కడా ఇబ్బందులు లేకుండా ఈవో ప్రసాద్ ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో ఉచిత మంచినీటిని పంపిణీ చేయించారు. పలువురు భక్తులు కేశఖండనశాలలో తలనీలాలను సమర్పించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మరికొందరు ఆరోగ్యం కోసం సూర్యనమస్కారాల పూజలు చేయించుకున్నారు. ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక తులసీదళాలతో ఆదిత్యుని మూల విరాట్టును అలంకరించి భక్తుల సర్వదర్శనాలకు ఉదయం 6 గంటల నుంచే అనుమతించారు. విశిష్ట, ప్రత్యేక దర్శనాలతో పాటు ఉచిత దర్శనాల క్యూలైన్లలోనూ భక్తులు బారులు తీరారు.

ఆదిత్యుని సన్నిధిలో డ్రాట్ ట్రిబ్యునల్ చైర్‌పర్సన్

అరసవల్లి సూర్యనారాయణ స్వామిని ది డెబ్ట్ రికవరీ అప్పిలేట్ ట్రిబ్యునల్ (డ్రాట్–కోల్‌కత్తా) జస్టిస్ అనిల్‌కుమార్ శ్రీవాత్సవ్ సతీసమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ సంప్రదాయం ప్రకారం ఈవో కె.ఎస్.వి.డి.వి.ప్రసాద్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మలు వేదమంత్రోచ్ఛారణల నడుమ పూర్ణకుంభ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. అనంతరం వేదాశీర్వచనాలతో అనివెట్టి మండపంలో స్వామి వారి శేషవస్త్రాలను కప్పి, తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వచనం అందించారు. ఆలయ విశిష్టతను, స్వామి వారికి జరుగుతున్న సేవల వివరాలను శంకరశర్మ వివరించారు.

ఉత్సాహంగా అథ్లెటిక్స్ ఎంపికలు



క్రీడాకారులకు సూచనలిస్తున్న నిర్వాహకులు



జావెలిన్ విసురుతూ..



400 మీటర్ల పరుగులో దూసుకెళ్తున్న బాలికలు

జిల్లాస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ క్రీడాకారుల ఎంపిక పోటీలు ఆద్యంతం ఉత్సాహంగా, హుషారుగా సాగాయి. జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కొన్న మధుసూదనరావు ఆధ్వర్యంలో శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో ఆదివారం జరిగిన ఈ ఎంపికలకు జిల్లా నలుమూలల నుంచి క్రీడాకారులు హాజరై తమ ప్రతిభను నిరూపించుకున్నారు. అండర్–14, 16, 18, 20 నాలుగు వయో విభాగాల్లో రన్స్, త్రోస్, జంప్స్ ఈవెంట్స్‌లో సత్తాచాటారు. వచ్చే నెల 9 నుంచి 11 వరకు చీరాలలో జరగనున్న రాష్ట్రపోటీలకు విజేతలను పంపిస్తారు. క్రీడాకారుల ట్రాక్ రికార్డు బట్టి తుది జాబితాను ప్రకటిస్తామని నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా పీఈటీ సంఘ అధ్యక్షుడు మొజ్జాడ వెంకటరమణ, అథ్లెటిక్స్ సంఘ జిల్లా కార్యదర్శి ఎం.సాంబమూర్తి, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ బి.వి.రమణ, కె.మాధవరావు, కె.హరిబాబు, తవిటయ్య, శ్రీనివాసరావు, ఆనంద్, మురళి, పద్మనాభరెడ్డి, గోవింద్, పీడీ, పీఈటీలు పాల్గొన్నారు. –శ్రీకాకుళం న్యూకాలనీ

క్లుప్తంగా

11 మంది మందుబాబులపై కేసులు



పెదమానాపురం సంత పరిధిలో మందుబాబులను పట్టించిన డ్రోన్స్

విజయనగరం క్రైమ్ : జిల్లా వ్యాప్తంగా బహిరంగంగా మద్యం తాగుతున్న వారిపై పోలీసులు కొరడా ఝుళిపిస్తున్నారు. గత వారమే జామి పోలీస్ స్టేషన్ పరిధి అలమండలో పోలీసులు మందుబాబులను అరెస్ట్ చేయగా ఈ ఆదివారం పెదమానాపురం పోలీస్ స్టేషన్ పరిధి సంత శివార్లలో బహిరంగ మద్యపానం చేస్తున్న 11మందిపై కేసులు నమోదు చేశారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న వారని ఉపేక్షించేది లేదని ఎస్పీ వకుల్ జిందల్ స్పష్టం చేశారు. వారం వారం జరుగుతున్న సంతలలో మందుబాబుల ఆగడాలను అరికట్టేందుకే డ్రోన్స్ ను ఆయా సంతలలో వినియోగిస్తున్నామన్నారు. ఈ క్రమంలోనే ఆకస్మికంగా డ్రోన్స్ తో దాడులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పెద మానాపురం ఎస్సై ఆర్.జయంతి ఓపెన్ డ్రింకింగ్ కేసులు నమోదు చేశారని ఎస్పీ తెలిపారు. దాడుల్లో పెద మానాపురం ఎస్ఐ తో పాటు డ్రోన్ పైలట్ వెంకటేష్, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో పందాల రాయుళ్లు

• రెండు పొట్టేళ్లు స్వాధీనం



దాడుల్లో పట్టుబడ్డ పొట్టేళ్లు, పందెం రాయుళ్లు

గరుగుబిల్లి: పొట్టేళ్ల పందెం నిర్వహిస్తున్న పందెం రాయుళ్లను అదుపులోకి తీసకుని రెండు పొట్టేళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ఎం. రమేష్ నాయుడు తెలిపారు. ఈ మేరకు ఆదివారం మండలంలోని రావివలస గ్రామ పరిసరాల్లో పందానికి సిద్ధం చేసిన రెండు పొట్టేళ్లను, నలుగురు పందెం రాయుళ్ల తోపాటు రూ. 620 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. పందెం నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు తమ సిబ్బందితో దాడులు చేసినట్లు చెప్పారు. ఎక్కడైనా జూదం గాని, పొట్టేళ్ల, కోళ్ల పందాలు నిర్వహిస్తే శాఖాపరమైన చర్యలు చేపట్టనున్నట్లు హెచ్చరించారు. పందెం రాయుళ్లపై కేసు నమోదు చేసి తదుపరి చర్యల నిమిత్తం పార్వతీపురం మెజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరచనున్నట్లు తెలిపారు. దాడుల్లో సిబ్బంది ఉమా మహేశ్వరరావు, కృష్ణమోహన్ పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి ఇద్దరు యువకులకు గాయాలు



క్షతగాత్రులకు ప్రథమ చికిత్స అందిస్తున్న 108 ఈఎంటీ ఈశ్వరరావు

రేగిడి: మండల పరిధిలోని అప్పాపురం గ్రామ సమీపంలో ఆదివారం బైక్ అదుపు తప్పి జరిగిన ప్రమాదంలో ఇద్దరు యువకులు గాయాలపాలయ్యారు. పాలకొండ మండలం మంగళాపురం గ్రామానికి చెందిన మడపాల సాయి, సంతకవిటి మండలం మామిడిపల్లి గ్రామానికి చెందిన కె.యోగేష్‌లు కె.వెంకటాపురంలోని తమ మిత్రుడిని కలిసేందుకు బైక్‌పై వెళ్తుండగా అప్పాపురం సమీపంలో బైక్ అదుపుతప్పడంతో ఇద్దరూ రోడ్డుపై పడిపోగా తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్పందించిన స్థానికులు 108కు సమాచారం అందించడంతో వాహనంతో వచ్చిన 108 ఈఎంటీ మీసాల ఈశ్వరరావు, పైలెట్ గర్భాపు నారాయణరావులు క్షతగాత్రులకు ప్రథమ చికిత్స అందించారు. బాధితుల కాళ్లు, చేతులకు గాయాలు కావడంతో మెరుగైన వైద్యంకోసం పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఆంధ్ర రిజర్వాయర్ నుంచి నీటి విడుదల

మెంటాడ: ఆంధ్ర రిజర్వాయరు నుంచి సాగు నీటిని మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, గుమ్మడి సంధ్యారాణి ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ రిజర్వాయర్ మరమ్మతులకు రూ.2కోట్లు, ప్రాజెక్టు అభివృద్ధికి రూ.కోటిన్నర నిధులు విడుదల చేసినట్టు చెప్పారు. మంత్రి సంధ్యారాణి మాట్లాడుతూ గుర్ల గెడ్డ, హైలెవల్ కెనాల్ పనులు పూర్తి చేయిస్తామన్నారు. సూపర్ 6 హామీలు అమలు చేస్తామన్నారు. పథకాలు అమలు చేయడం లేదని గ్రామాల్లో తిరుగుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులను చొక్కాలు పట్టుకొని ప్రశ్నించండని రెచ్చగొట్టారు. నియోజకవర్గ పునర్విభజనలో మెంటాడ మండలం గజపతినగరంలోకి వస్తే పరవాలేదని, లేకుంటే పార్వతీపురం జిల్లాలో కలిపేలా చేస్తానన్నారు. ప్రాజెక్టు చైర్మన్ కోడి సతీష్, తహసీల్దార్ అరుణకుమారి, ఎంపీడీవో భానుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పిల్లల్లో తగ్గుతున్న పెరుగుదల..!

- 6 ఏళ్ల లోపు పిల్లలు 67,381
- బరువు తక్కువగా ఉన్న పిల్లలు 3,569
- ఎత్తు తక్కువ ఉన్న పిల్లలు 7,316
- పౌష్టికాహార లోపం ఉన్న పిల్లలు 2,410

పుట్టిన నాటి నుంచి 24 నెలల వరకు ఉండాల్సిన బరువు, ఎత్తు

వయస్సు	బరువు	ఎత్తు
పుట్టినప్పుడు	3.3కిలోలు	49.9సెం.మీ
3నెలలు	6.4కిలోలు	61.4సెం.మీ
6 నెలలు	7.9కిలోలు	67.6సెం.మీ
9నెలలు	8.9 కిలోలు	72సెం.మీ
12నెలలు	9.6 కిలోలు	75.7 సెం.మీ
15నెలలు	10.3కిలోలు	79.1 సెం.మీ
18	10.9కిలోలు	82.3సెం.మీ
21నెలలు	11.5 కిలోలు	85.1 సెం.మీ
24నెలలు	12.2 కిలోలు	87.8 సెం.మీ



పట్టణంలోని సాలిపేట అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారికి బరువు తూనిక వేస్తున్న కార్యకర్త

విజయనగరం ఫోర్ట్: అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ఉన్న పిల్లలు పౌష్టికాహార లోపంతో బాధపడుతున్నారు. వేలాది మంది పిల్లలు పౌష్టికాహార లోపానికి గురవుతున్నారు. పౌష్టికాహార లోపంతో పాటు ఎత్తుకు తగ్గ బరువు, వయసుకు తగ్గ ఎత్తు లేని పిల్లలు అధికంగా ఉన్నారు. పిల్లలు ఆరోగ్యంగా ఉండేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని కూటమి ప్రభుత్వం చెబుతోంది. కానీ వాస్తవ పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంటోంది. పౌష్టికాహార లోపం బారిన పడడం వల్ల పిల్లలు తరచూ అనారోగ్యానికి గురవుతున్నారు. గర్భం దాల్చిన ప్పటి నుంచి మాతాశిశు ఆరోగ్యానికి చర్యలు తీసుకుంటున్నామని ప్రభుత్వం చెబుతున్న మాటలు ఫలితం ఇవ్వడం లేదు. పుట్టే ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా, పుట్టినట్లయితే సమస్యలు ఉండవు. పౌష్టికాహార లోపం వల్ల పిల్లలు అనేక అనారోగ్య సమస్యలతో పుడుతున్నారు. తల్లులు బలహీనంగా ఉండడం, గర్భస్థ సమయంలో అనారోగ్యానికి గురికావడం, తక్కువ వయస్సులో వివాహాలు చేయడం, మహిళల్లో రక్తహీనత తదితర కారణాల వల్ల పుట్టే పిల్లల్లో కొంతమంది పౌష్టికాహార లోపం , బరువు తక్కువగా పుడుతున్నారు. జిల్లాలో 11 ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. వాటి పరిధిలో 2499 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో 292 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో 67,381 మంది ఆరేళ్ల లోపు పిల్లలు ఉన్నారు.

ఎత్తు తక్కువగా ఉన్న పిల్లలు 7,316 మంది

జిల్లాలో ఉన్న ఆరేళ్ల లోపు పిల్లల్లో 7,316 మంది ఎత్తు తక్కువగా ఉన్నారు. అదేవిధంగా బరువు తక్కువగా ఉన్న వారు 3,569 మంది ఉన్నారు. 2410 మంది పిల్లలు పౌష్టికాహార లోపంతో ఉన్నారు.

ఎత్తు, బరువు తూనిక:

పిల్లల బరువు, ఎత్తు తెలుసుకునేందుకు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న పరికరాల ద్వారా తూనిక వేస్తారు. బరువు, ఎత్తు తక్కువగా ఉన్న పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలి

ప్రత్యేక పౌష్టికాహారం

6 నెలల లోపు పిల్లలు బరువు తక్కువగా ఉన్నా, పౌష్టికాహార లోపం ఉన్నా తల్లిపాలు ఆరు నెలలు పాటు తాగించాలని అంగన్వాడీ కార్యకర్త పిల్లవాడి ఇంటికి వెళ్లి తల్లికి చెబుతారు. 6 నెలలు దాటిన పిల్లలకు అయితే తల్లిపాలతో పాటు బాలామృతం, 100 ఎంఎల్ పాలు, గుడ్డు ఇస్తారు. ఇటువంటి వారికి ఆహారాన్ని రోజులో 8 సార్లు ఇస్తారు.

ప్రత్యేక శ్రద్ధ



అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ఉన్న పౌష్టికాహార లోపం, బరువు, ఎత్తు తక్కువగా ఉన్న పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నాం. వయసుకు తగ్గ ఎత్తు, బరువు లేని పిల్లలను పౌష్టికాహార లోపం ఉన్నట్లు గుర్తించి వారికి ప్రత్యేకమైన పౌష్టికాహారాన్ని అందిస్తాం. సాధారణంగా ప్రతి వ్యక్తి రోజులో మూడు సార్లు ఆహారంగా తీసుకుంటారు. కాని పౌష్టికాహార లోపం ఉన్న పిల్లలకు రోజులో 8 సార్లు ఆహారాన్ని అందించే విధంగా చర్యలు తీసుకుంటాం.

టి.విమలారాణి, ప్రాజెక్టు డైరెక్టర్, ఐసీడీఎస్

రహదారి నిర్మాణం పూర్తి

• కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్



పార్వతీపురం రూరల్: మండలంలోని బాగుజోల నుంచి చిలకమెండంగి వరకు రహదారి పనులు పూర్తయినట్లు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పేర్కొన్నారు. రూ.2.50 కోట్ల వ్యయంతో ఈ రహదారి పనులు చేశామని తెలిపారు. రోడ్డుకు ఇరువైపులా రఫ్ స్టోన్ ప్యాకింగ్, తారు రహదారిగా మార్చే పనులు పూర్తి కావాల్సి ఉందన్నారు. రహదారి సౌకర్యం లేని గిరిజన ప్రాంతాలకు రహదారులు కల్పించే దిశగా గత ఏడాది డిసెంబర్ 20న మక్కువ మండలం బాగుజోలలో పలు రహదారులకు ఉపముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతం ఈ రోడ్డు ద్విచక్ర వాహనాలు, అంబులెన్సులు, జీపులు, కార్లు వంటి వాహనాలు తిరిగేందుకు అనువుగా ఉన్నట్లు కలెక్టర్ వివరించారు. రెండు కోట్ల రూపాయల విలువ మేరకు పనులు జరిగాయని, ఇందులో రూ.56 లక్షలు చెల్లింపు జరిగిందని తెలియజేశారు. మిగిలిన మొత్తం చెల్లింపు చేయాల్సి ఉందన్నారు. గుమ్మలక్ష్మీపురం మండలంలో రూ.360 లక్షల వ్యయంతో పాములగీసడ నుంచి మంత్రజోల వరకు 3.60 కి.మీ మేర బీటీ రోడ్డు పనులు ప్రగతిలో ఉన్నాయన్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్ మొదటి వారంలోగా పూర్తిచేయనున్నట్లు చెప్పారు. 8 కిలోమీటర్ల వరకు మట్టి రహదారి నిర్మాణం జరిగిందన్నారు. సాలూరు మండలం బాగుజోల నుంచి సిరివర వరకు 6.60 కిలో మీటర్ల మేర తారు రహదారి వేసేందుకు ప్రభుత్వం రూ.9 వందల లక్షలు మంజూరు చేసిందని, మట్టి రహదారి నిర్మాణం పూర్తయినట్లు తెలిపారు. వచ్చే ఏడాది అక్టోబర్ నాటికి రహదారి నిర్మాణం పూర్తవుతుందన్నారు. పాచిపెంట మండలం అల్లూరు నుంచి రిట్టపాడు వరకు గల రహదారి రూ.నాలుగు వందల లక్షలతో తారు రహదారిగా నిర్మించేందుకు మంజూరైందని, అటవీ అనుమతులు పూర్తి చేసి పనులు ప్రారంభిస్తామని చెప్పారు.

రాధికారాణికి జాతీయ పురస్కారం



జాతీయ పురస్కారం అందుకుంటున్న నర్తనశాల అకాడమీ డ్యాన్స్ డైరెక్టర్ డాక్టర్ భేరి రాధికారాణి

విజయనగరం టౌన్: నార్త్ ఢిల్లీ కల్చరల్ అకాడమీ ప్రతి ఏటా ఇచ్చే జాతీయ స్థాయి పురస్కారాల్లో భాగంగా విజయనగరానికి చెందిన ప్రముఖ నృత్య కళాకారిణి, నర్తనశాల డ్యాన్స్ అకాడమీ డైరెక్టర్ డాక్టర్ భేరి రాధికారాణిని జాతీయ పురస్కారంతో సత్కరించారు. ఈ మేరకు ఆదివారం ఆమె మాట్లాడుతూ హైదరాబాద్‌లోని త్యాగరాయ గానసభలో శనివారం రాత్రి నిర్వహించిన వేడుకల్లో తన నాట్య కౌశలం, అభినయం, నర్తనశాల అకాడమీ డైరెక్టర్‌గా నాట్యరంగానికి సుమారు మూడు దశాబ్దాలుగా అందిస్తున్న సేవలను గుర్తించి అవార్డును తనకు అందజేసినట్లు తెలిపారు. కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ సముద్రాల వేణుగోపాలాచారి, మల్కాజ్‌గిరి కోర్టు న్యాయమూర్తి మధుసూదనరావుల చేతుల మీదుగా పురస్కారం అందుకున్నట్లు చెప్పారు. ఈ మేరకు జిల్లాకు చెందిన పలు సాంస్కృతిక సస్థల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

• 21.55 మెట్రిక్ టన్నుల ఎరువుల సీజ్



ఎరువుల నిల్వలను తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి తారకరామారావు, తదితరులు

విజయనగరం ఫోర్ట్: విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న ఎరువుల దుకాణాల్లో వ్యవసాయ అధికారులు ఆదివారం తనిఖీ నిర్వహించారు. జిల్లా వ్యవసాయ అధికారి వి. తారకరామారావు, సహాయ సంచాలకుడు నాగభూషణరావు, ఇన్‌చార్జి మండల వ్యవసాయ అధికారి నీలిమ తనిఖీలు నిర్వహించి స్టాక్ రిజిస్టర్‌లు, బిల్లు పుస్తకాలు, ఎరువుల భౌతిక నిల్వలు, కంపెనీ ఇన్వాయిస్ గోదాములను పరిశీలించారు. ఈ తనిఖీల్లో నిబంధనలకు విరుద్ధంగా ఉన్న 21.55 మెట్రిక్ టన్నుల ఎరువులను సీజ్ చేశారు. సీజ్ చేసిన ఎరువుల విలువ రూ.3,74,588 ఉంటుందని జిల్లా వ్యవసాయ అధికారి తారకరామరావు తెలిపారు. జిల్లాలో ఖరీఫ్ సీజన్‌మొత్తానికి 25,443 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా ప్రస్తుతానికి 20, 629 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉంచామని అమ్మకాలు పోగా 5467మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. ఎంఆర్‌పీకి మించి ఎరువులు ఎక్కడైనా విక్రయించినట్లయితే ఫోన్ 8331056279 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

బెల్లం ఊటలు ధ్వంసం



సారా వండడానికి సిద్ధం చేసిన ఊటలు ధ్వంసం చేస్తున్న ఎస్సై, సిబ్బంది

సీతంపేట: మండలంలోని కొండాడ సమీపంలో సారా బట్టీలపై ఆదివారం జరిగిన దాడుల్లో 20 లీటర్ల సారా, సారా వండడానికి సిద్ధం చేసిన 180లీటర్ల పులిసిన బెల్లం ఊటలు ధ్వంసం చేసినట్లు ఎస్సై వై.అమ్మన్నావు తెలిపారు. సారా వండినా, విక్రయించినా, అక్రమరవాణా చేసినా చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.

మేతకు వెళ్లిన 18 గొర్రెల మృతి

• మరో 20 గొర్రెలకు అస్వస్థత



బందలుప్పిలో మృతి చెందిన గొర్రెలు

పార్వతీపురం రూరల్: మండలంలోని బందలుప్పి గ్రామ సమీపంలో బందలుప్పి నుంచి తాళ్లబురిడి గ్రామానికి వెళ్లే మట్టి రోడ్డు మార్గంలో మధ్యలో ఉన్న నీలగిరి తోటల్లోకి మేతకు వెళ్లిన 18 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. బాధిత గొర్రెల కాపరులు నీలబోను గోవింద, చందపు సింహాద్రి తెలిపిన వివరాల ప్రకారం..ఎప్పటిలాగానే తాము పెంచుకుంటున్న గొర్రెలు, మేకలను ఆదివారం సాయంత్రం శ్రీనివాసరావు అనే రైతు నీలగిరి తోటకు తరలించామని, ఆ తోటకు క్రిమిసంహారక మందులు, యూరియా పిచికారీ చేయడంతో ఈ విషయం గమనించకుండా పశుగ్రాసం కోసం మేకలు, గొర్రెలను విడిచిపెట్టామన్నారు. అవి తోటలోకి ప్రవేశించిన కొద్దిసేపటికే ఒకసారిగా 18 గొర్రెలు మృత్యువాత పడడంతో గమనించి స్థానిక పశు వైద్యుడికి సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. ఈ మేరకు పశు వైద్యుడు రెడ్డి రమేష్ చేరుకుని గొర్రెలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. గొర్రెల మృతి కారణంగా తీవ్రంగా నష్టపోవడంతో కాపరులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

తప్పిన ముప్పు



ట్రాన్స్‌ఫార్మర్ వద్ద చెలరేగిన మంటలు

శృంగవరపుకోట: మండలంలోని సీతంపేట గ్రామంలో పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో ఆదివారం మధ్యాహ్నం అకస్మాత్తుగా మంటలు రేగాయి. దీంతో స్థానికులు విద్యుత్ సిబ్బందికి, ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మంటలను అదుపు చేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

జీఆర్పీ ఆధ్వర్యంలో గంజాయి తనిఖీలు



విజయనగరం స్టేషన్‌లో కొరాపుట్ విశాఖ పాసింజర్ రైలులో తనిఖీలు చేస్తున్న పోలీసులు

విజయనగరం క్రైమ్: గంజాయి అక్రమ రవాణాను అరికట్టడంపై జీఆర్పీ సిబ్బంది దృష్టి పెట్టారు. ఈ మేరకు జీఆర్పీ ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్ ఆదేశాల మేరకు స్థానిక పోలీసులు, ఆర్పీఎఫ్, ఈగల్ టీమ్ బృందాలు ఆదివారం విజయనగరం రైల్వే స్టేషన్ లో ప్లాట్‌ఫామ్‌లపైన, వచ్చే,పోయే రైళ్లలో ఆకస్మిక తనిఖీలు చేశారు. కొరాపుట్, విశాఖపట్నం పాసింజర్ రైలులో బొబ్బిలి నుంచి కొత్తవలస రైల్వే స్టేషన్ వరకు సంయుక్త ఆపరేషన్ నిర్వహించినట్లు జీఆర్పీ ఎస్సై బాలాజీ రావు తెలిపారు.

సబ్జెక్టు టీచర్లతో లాంగ్వేజీల బోధన

- అర్థం కాక తలలు పట్టుకుంటున్న విద్యార్థులు
- బోధించలేమని చేతులెత్తేస్తున్న ఉపాధ్యాయులు
- విద్యార్థుల జీవితాలతో కూటమి ఆటలు!

రామభద్రపురం:

కూటమి ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో ఆటలాడుకుంటోంది. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ప్రభుత్వ యూపీ స్కూల్స్‌ను పూర్తిగా నిర్వీర్యం చేసేందుకు కుట్ర పన్నుతోంది. ఇటీవల ప్రభుత్వ పాఠశాలల టీచర్లకు బదిలీలు చేపట్టిన ప్రభుత్వం యూపీ స్కూళ్లలో ఉన్న తెలుగు, హిందీ పండిట్‌లను ఎల్‌ఎఫ్ఎల్, ఎంపీఎస్ హెచ్‌ఎంలుగా బదిలీ చేసింది. యూపీ స్కూల్స్‌లో లాంగ్వేజ్ పండిట్‌లు లేకుండా చేసింది. పాఠశాలలో ఉన్న టీచర్లలో ఎవరో ఒకరు లాంగ్వేజ్‌లు బోధించాలని విద్యాశాఖ ఉన్నతాధికారులు ఆదేశించినట్లు తెలిసింది. అయితే టీచర్లు ఉపాధ్యాయ విద్య చదివినా లాంగ్వేజ్ బోధన నైపుణ్యాలపై వారికి అవగాహన ఉండడం లేదు.సోషల్ టీచర్‌ను హిందీ చెప్పమంటే ఏం చెప్పగలరన్న విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లాలో సుమారు 158 యూపీ పాఠశాలలు ఉన్నాయి. వాటిలో ప్రభుత్వం విద్యార్థుల సంఖ్యకు తగ్గట్లు ఉపాధ్యాయులను నియమించడంలో నిర్లక్ష్యం చూపడంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుతోందని విమర్శలు ఉన్నాయి. ప్రభుత్వ తీరుతో కొత్త పిల్లలను జాయిన్ చేయడం మాట దేవుడెరుగు ఉన్న పిల్లలను ఎలా కాపాడుకోవాలా? అని ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు.

చదివేదొకటి..చెప్పేదొకటి..

ప్రభుత్వం తీరు వల్ల బీఈడీలో చదివేదొకటి, పాఠశాలల్లో చెప్పేదొకటి అన్నచందంగా ఉందని టీచర్లు అంటున్నారు.యూపీ పాఠశాలల్లో లాంగ్వేజ్ పండిట్లను పీస్ హెచ్‌ఎంలుగా బదిలీ చేయడంతో సోషల్, బయాలజీ, గణితం సబ్జెక్టు చెబుతున్న టీచర్లు తెలుగు, హిందీ లాంగ్వేజ్‌లు చెప్పాల్సిన దుస్థితి నెలకొంది. ఇలా చేస్తే విద్యా ప్రమాణాలు మెరుగుపడడం దేవుడెరుగు. అసలు సంబంధం లేని పాఠాలను ఎలా బోధిస్తారనే జ్ఞానం ఉండదా? అని టీచర్లు ప్రశ్నిస్తున్నారు. ఉపాధ్యాయుల కొరత మూలంగా విద్యార్థుల సంఖ్య తగ్గిపోతుండంతో ప్రభుత్వ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రామభద్ర పురం మండలంలోని కోటశిర్లాం యూపీ పాఠశాలలో 6,7,8 తరగతులలో 28 మంది విద్యార్థులుండగా ఇద్దరు టీచర్లు మాత్రమే మొత్తం ఆరు సబ్జెక్టులు బోధిస్తున్నారు. ఇందులో తెలుగు, ఇంగ్లీషు, హిందీ లాగ్వేజ్‌లు ఒక్క టీచరే బోధిస్తున్నారు. దీంతో విద్యార్థుల్లో 8 మంది తమకు సరిపడా టీచర్లు లేరని, సరైన విద్యాబోధన అందడం లేదన్న ఉద్దేశంతో టీసీలు తీసుకుని వేరే పాఠశాలలకు వెళ్లియారు. మిగిలిన వారు కూడా ఇలాగే పరిస్థితి ఉంటే తాము కూడా ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లిపోతామంటున్నారు.



కోటశిర్లాం యూపీ పాఠశాలలో ఇంగ్లీషు, తెలుగు, హిందీ ఒక్కరే బోధిస్తున్నారని చెబుతున్న విద్యార్థులు



నాయుడువలస యూపీ పాఠశాలలో తెలుగు బోధిస్తున్న సోషల్ టీచర్



ఇట్లామామిడిపల్లి యూపీ పాఠశాల

సరిగ్గా అర్థం కావడం లేదు..



మా పాఠశాలలో తెలుగు, హిందీ లాంగ్వేజ్‌లను బయాలజీ, ఇంగ్లీషు టీచర్లు బోధిస్తున్నారు. మాకు సక్రమంగా అర్థం కావడం లేదు. దీంతో నాణ్యమైన విద్య అందడం లేదు. ఇలా అయితే ప్రభుత్వ స్కూల్స్‌లో చదవలేం. తీరు మారకుంటే టీసీలు పట్టుకుని వేరే పాఠశాలకు వెళ్లిపోతాం.

బి.మేఘన, 8వ తరగతి,యూపీ స్కూల్, ఇట్లా మామిడిపల్లి

యూపీ పాఠశాలలు కనుమరుగయ్యే ప్రమాదం..

యూపీ స్కూల్స్‌లలో తెలుగు, హిందీ బోధించే ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థులకు పూర్తిస్థాయిలో విద్య అందడంలేదు. లాంగ్వేజ్‌ల బోధన లేక 6,7,8 తరగతుల విద్యార్థులు చేరడం లేదు. ప్రభుత్వ విద్యాసంస్కరణలతో పాఠశాల విద్య అస్తవ్యస్తంగా ఉంది. భవిష్యత్‌లో యూపీ పాఠశాలలు కనుమరుగయ్యే ప్రమాదం ఉంది.

జేసీ రాజు, ఏపీటీఎఫ్ రాష్ట్ర అకడమిక్ కన్వీనర్

లాంగ్వేజ్ టీచర్ల కొరత వాస్తవమే..



యూపీ స్కూల్స్‌లో ఉన్న మిగులు ఉపాధ్యాయులను ఎల్‌ఎఫ్ఎల్, ఎంపీఎస్ హెచ్‌ఎంలుగా బదిలీచేశారు. దాంతో లాంగ్వేజ్ టీచర్ల కొరత ఉంది. ప్రస్తుత క్లస్టర్ స్కూల్స్‌లో ఉన్న ఎంటీఎస్‌లను వినియోగించుకోవాలి. డీఎస్సీ నియామకాలు చేపడితే కొత్త టీచర్లను నియమిస్తారు.

కె.మోహనరావు, డిప్యూటీ డీఈవో

త్రుటిలో తప్పిన ప్రమాదం

సీతంపేట: ఆటో బోల్తా పడిన సంఘటనలో ప్రమాదం త్రుటిలో తప్పింది. అడలి వ్యూపాయింట్ సమీపంలో ఉన్న బొక్కిడిగూడ వద్ద ఆదివారం ఆటో అదుపుతప్పి పడిపోయింది. ఆ సమయంలో ఆటోలో డ్రైవర్ తప్ప ప్రయాణికులు లేకపోవడంతో పెద్దప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. దీనిపై ఎటువంటి ఫిర్యాదు రాలేదని ఎస్సై వై.అమ్మన్నరావు తెలిపారు.

అందరి భాగస్వామ్యంతోనే ఉత్తరాంధ్ర అభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న అజశర్మ

రాజాం సిటీ: వెనుబాటుకు గురైన ఉత్తరాంధ్ర అభివృద్ధి సాధనకు ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని ఉత్తరాంధ్ర అభివృద్ధి కమిటీ కన్వీనర్ ఎ.అజశర్మ అన్నారు. స్థానిక ఓ పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక డివిజన్ స్థాయి సమావేశం ఆదివారం నిర్వహించారు. సమావేశంలో 'ఉత్తరాంధ్ర వెనుకబాటు–శాస్త్రీయ పరిశీలన' అనే అంశంపై ఆయన మాట్లాడా రు. ఉత్తరాంధ్రలో నీటి పారుదల ప్రాజెక్టులు నిర్వహణ లోపం, అటవీ సంపద సద్వినియోగలోపం, అక్షరాస్యతలో రాష్ట్రం అట్టడుగు స్థానంలో ఉండడం, సముద్రతీర సంపదను కార్పొరేట్ శక్తులు చేతిలోకి వెళ్లిపోవడం, పర్యావరణ పరిరక్షణ లోపం, జమిందారీ వ్యవస్థ వంటి అనేక కారణాల వలన ఉత్తరాంధ్ర ఇప్పటికీ వెనుకబాటు తనానికి గురైందని అన్నారు. వీటన్నింటిపై ప్రజలను చైతన్యపరిచి భాగస్వాములుగా చేయడం ద్వారా ఉత్తరాంధ్రను అభివృద్ధి వైపు తీసుకువెళ్లే అవకాశం ఉందని తెలిపారు. జేవీవీ అధ్యక్షుడు ఎంవీఎస్ వెంకటరావు మాట్లాడుతూ సెప్టెంబర్ 13, 14తేదీల్లో విజయనగరంలో జరగనున్న రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జేవీవీ సభ్యులు జె. నీలయ్య, మక్క అప్పలనాయుడు, గట్టి పాపారావు పాల్గొన్నారు.